క్లుప్తంగా

వాహన రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలి


ద్విచక్ర వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం : ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గురువారం బలిజకండ్రిగ–షోలింగర్ జాతీయ రహదారిపై ద్విచక్రవానాల తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో చిన్న వయసువారే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్రవాహనం నడిపేవారు తప్పకుండా వాహన రికార్డులు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలని, ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా జరిమానా తప్పదని హెచ్చరించారు.

కల్వర్టు నిర్మాణాలు పూర్తి


పూర్తయిన రోడ్డు నిర్మాణం

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు నిర్మాణాలు, రోడ్డు పనులు పూర్తి చేసినట్లు మండల సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రోజా చొరవతో రూ.17 లక్షలతో కల్వర్టులు, రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. త్వరలో మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ సుబ్రహ్మణ్యం మృతి


కలికిరి సుబ్రమణ్యం

(పెనుమూరు) చిత్తూరు అగ్రికల్చర్: పెనుమూరు మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కలికిరి సుబ్రహ్మణ్యం గురువారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్య మరింత క్షీణించడంతో బుధవారం మధ్యాహ్నం ఆయన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. కాగా ఆయన 2001–06 మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీగా పనిచేశారు. ఆయన మృతదేహానికి శుక్రవారం స్వగ్రామమైన గుట్టకిందపల్లె దళితవాడలో దహనక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

నిరంతరం యజ్ఞయాగాదులు


అధికారులతో సమీక్షిస్తున్న జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: లోక క్షేమం కోసం టీటీడీ ఆధ్వర్యంలో వేద విశ్వవిద్యాలయంలో ఇక 365 రోజులూ యజ్ఞ యాగాదులు, వ్రతాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు జేఈవో సదా భార్గవి తెలిపారు. ఆమె గురువారం శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, మ్యాన్ స్క్రిప్ట్స్ ప్రాజెక్ట్ ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ యజ్ఞ యాగాదులు, వ్రతాల కోసం యజ్ఞ శాలలు, హోమ గుండాలతోపాటు 150 మంది భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలన్నీ ఎస్వీబీసీ ద్వారా ప్రసారం చేసేలా చూడాలని ఆదేశించారు. వేదాలు, పురాణాల్లో పేర్కొన్న వ్యక్తిత్వ వికాస సోపానాలను శ్రీవెంకటేశ్వర వేద వర్సిటీ పండితులతో చెప్పించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమాలను మే నెలాఖరులోపు సామాజిక మాధ్యమాల్లో అప్ లోడ్ చేయడానికి అనుగుణంగా వేద విశ్వవిద్యాలయం స్టూడియోలో ఉపన్యాసాల చిత్రీకరణ ప్రారంభించాలన్నారు. వేద వర్సిటీకి న్యాక్ గుర్తింపు ప్రక్రియ, జాతీయ విద్యావిధానం అమలు, సిలబస్ తయారీ తదితరాలు వేసవి సెలవులు ముగిసేలోగా పూర్తి చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సుల ప్రారంభానికి అవసరమైన తరగతి గదులు తదితరాలను ఉన్న భవనాల్లోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. నక్షత్ర వనాల ప్రగతిపై జేఈవో సమీక్షిస్తూ అటవీ విభాగం తో సమన్వయం చేసుకుని త్వరగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్వీబీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షణ్ముఖ్ కుమార్, వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యామ్, ఈఈ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కానుక సిద్ధం.. భవితకు వరం


యూనిఫాం కిట్స్

"పిల్లలు చక్కగా చదువుకోవాలి.. కలెక్టర్, ఇంజినీర్ లాంటి పెద్దపెద్ద చదువులు చదవాలి. అప్పుడే ఆ కుటుంబం బాగుపడుతుంది. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారాలి. అన్ని వసతులు సమకూర్చి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దాలి. అప్పుడే పిల్లలు సంతోషంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోగలరు.." ఇవీ ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్న మాటలివి. ఆయన ముఖ్యమంత్రి కాగానే వెనువెంటనే ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేశారు.


పుత్తూరుకు చేరుకున్న యూనిఫాం బస్తాలు

- మండల కేంద్రాలకు చేరుతున్న జగనన్న విద్యాకానుక కిట్లు
- స్కూళ్లు తెరిచే నాటికి పంపిణీ చేసేలా పటిష్ట చర్యలు
- కసరత్తు చేస్తున్న అధికారులు


యూనిఫాం బండిళ్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పుత్తూరురూరల్: రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యం, ఆరోగ్యం రంగాలకు పెద్దపీట వేస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే మొదటి దశలో పలు స్కూళ్ల రూపురేఖలు మార్చయగా, ఇప్పుడు రెండో విడత కింద మరిన్ని స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం ఏటా సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పంపిణీ చేసేలా పటిష్ట చర్యలు చేపట్టింది. ఇప్పటికే మండలకేంద్రాలకు జగనన్న విద్యాకానుక కిట్లు వచ్చి చేరాయి.

సంక్షేమ పథకాలతో చదువులు..

రాష్ట్రప్రభుత్వం ప్రతి విద్యార్థి మంచి చదువును అందించాలన్న సదుద్దేశంతో అమ్మఒడి, నాడు–నేడు లాంటి వినూత్న పథకాలు ప్రవేశపెట్టింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యావిధానాన్ని సైతం తీసుకొచ్చింది. విద్యారంగంపై ప్రభుత్వ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి జగనన్న విద్యాకానుక పథకం కింద స్కూల్ బ్యాగులు, షూలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యాకానుకల కిట్లు మండల కేంద్రాలకు చేరుతున్నాయి. పుత్తూరులోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు యూనిఫాం బస్తాలు చేరాయి. పుత్తూరు మండలంలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 3,311 మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి సంబంధించి యూనిఫాం కిట్లు వచ్చాయి. పుత్తూరు మండలంలో మొత్తం 81 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 62, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 5, హైస్కూళ్లు 12, గురుకుల పాఠశాలలు 2 ఉన్నాయి. వీటిల్లో మొత్తం 6366 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక కిట్లు అందించడానికి విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పండుగ వాతావరణంలో పంపిణీ..



"పుత్తూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంగా మండలంలోని అన్ని స్కూళ్లకు జగనన్న విద్యాకానుకలను అందజేయడం జరుగుతుంది. ప్రతి పాఠశాల హెచ్‌ఎం ఇక్కడి వచ్చి వారి స్కూళ్లకు కిట్లను తీసుకెళ్లాలి. పాఠశాలల ప్రారంభం రోజునే ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. పాఠశాల విద్యలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఇందుకు అనుగుణంగా సత్ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది. – బి.తిరుమలరాజు, ఎంఈఓ, పుత్తూరు

నేడు గడప గడపకు..

పాలసముద్రం : మండలంలోని పాలసముద్రం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డిప్యూటీసీఎం నారాయణస్వామి పాల్గొని దాసరి కాలనీ గ్రామస్తులకు ఇట్టిపట్టాలను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన పాలసముద్రం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. తరువాత గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని తెలిపారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి


నింద్రలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ శ్రీధర్‌రాజు

నింద్ర: మండలంలోని నింద్ర, ఎలకాటూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహనిర్మాణ పనులు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు అన్నారు. గురువారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు నిర్వహించాలని కోరారు. ఆయనతో పాటు సర్పంచ్ బాబురెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవండి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం ఏఎన్ కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రికి స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్లి ఆమె స్థానికులతో మాట్లాడారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ద్వారా సమస్యకు పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చామని.. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశామని తెలిపారు. జగనన్నకు అండగా నిలవాలని మమ్మల్ని ఆశీర్వదించాలని కోరారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తీరుస్తామని భరోసా ఇస్తూ కార్యక్రమాన్ని ముందుకు సాగించారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు అన్ని పథకాలను పారదర్శకంగానే అందాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

తక్షణ వైద్యసదుపాయం..

ఈ సందర్భంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్తున్న మంత్రి రోజాకు తమకు జ్వరంగా ఉందని నలుగురు తెలుపగా వెంటనే వైద్యసిబ్బందిని అక్కడికి పిలిపించారు. ప్రజలు సీజనల్ జ్వరాల బారిన పడ్డారని, తక్షణం అందరికీ పరీక్షలు చేయాలన్నారు. అలాగే కాలనీల్లో ఇంకా ఎవరైనా అనారోగ్యం పాలై ఉంటే వారికి కూడా చికిత్స అందించాలని ఆదేశించారు. తమ పాలనలో ప్రజలకు ఏయే పథకాల ద్వారా మేలుచేశారో టీడీపీ నాయకులు చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను అందించారు. మండుటెండను సైతం లెక్కచేయక ఆమె గడప గడపలో పర్యటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, దేశమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుబాబు, నాయకులు రామకృష్ణ, శశికుమార్, సచివాలయ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు, కల్యాణానికి హాజరైన దంపతులు

వెదురుకుప్పం: మండలకేంద్రంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి జయంతి వేడుకలను పురస్కరించుకుని గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని అంరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అలంకరించారు. తరువాత సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య మాంగళ్యధారణ క్రతువును పూర్తి చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ నీరజా రాధారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. అలాగే కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు యువత అన్నదానం చేశారు.

విరివిగా విరాళాలు

ఉత్సవాల సందర్భంగా ఆలయానికి పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. అందులో తిరుమల జ్యూవెలరీ యజమాని తిరుమలాచారి రూ.5 లక్షలు విలువ చేసే పంచవెండి తొడుగును వితరణ చేశారు. అదేవిధంగా తిరుపతికి చెందిన హేమలత, లోకనాథం రూ.లక్ష విలువ చేసే లాకర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు మిట్టపల్లె సుబ్రమణ్యం రెడ్డి, నిర్వాహకులు జయరామిరెడ్డి, నెహ్రూ, ప్రశాంత్, బండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కపిలేశ్వరుడి పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరగనున్న పత్ర పుష్పయాగానికి గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవకలశ స్థాపన చేపడతారు. శుక్రవారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 10 నుంచి 12 గంటల వరకు పత్రపుష్పయాగ మహోత్సవంలో భాగంగా వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగనుంది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సారా పట్టివేత



చిత్తూరు అర్బన్: బంగారుపాళెం మండలంలో గురువారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి చిలగుండ్లపల్లెకు చెందిన రవి (45)ని పట్టుకున్నారు. ఆయన నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఈఈ మధుసూదనరావు

కార్వేటినగరం: ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతున్న విషయం విదితమే. నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సర్వశిక్షణ అభియాన్ ఈఈ మధుసూదన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల, ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలోపు నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని, రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు నిర్మాణం చేయాలని సూచించారు. నాడు–నేడు పనులకు ప్రభుత్వం వెంటనే చెల్లిస్తున్నాయని గుర్తు చేశారు. స్కూళ్ల హెచ్‌ఎంలు పనులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం, స్కూళ్ల హెచ్‌ఎంలు పలువురు ఉన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు


బెల్లం ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ సీనియర్ అసిస్టెంట్ నీరజ అన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ లోకనాథ పిళ్లైతో కలసి మండలంలోని శెట్టివానత్తం, ఎస్సార్‌పురం ప్రాంతాల్లో బెల్లం ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మహిళలకు అనేక రంగాల్లో శిక్షణ కల్పించి పరిశ్రమలు నెలకొల్పడానికి కావలసిన వనరులను సమకూర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. బెల్లం ఫ్యాక్టరీ నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి అవసరమని, స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు చెరుకు సాగు చేస్తున్నారని, రైతుల నుంచి ప్రభుత్వం చెరుకును నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. అలాగే చెరుకు నుంచి వచ్చే పిప్పితో కప్పుల తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా మహిళలకు ప్రత్యక్షంగా 500 మంది నుంచి 2 వేల మందికి ఉపాధి కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మురళి, ఆర్‌ఐ త్యాగరాజులు, ఏపీఎం రోజా తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత


లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి రోజా

నగరి : నియోజవర్గంలో అనారోగ్యం బారిన పడి తమస్థాయికి మించి ఖర్చుచేసి చికిత్స పొందిన పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సహకారం అందించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నగరి మున్సిపాలిటీకి చెందిన బాబు రెడ్డి, గోపీనాథ్, నాగమ్మకు, అలాగే పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన సురేష్ బాబు, విజయపురం మండలం కోసలనగరం గ్రామానికి చెందిన చాందినికి సీఎం సహాయనిధి సాయం అందజేశారు. ఐదుగురికి మొత్తం రూ.13.60 లక్షలు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని విధాలుగా ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపరచి ఉన్నత వైద్యసేవలు అందించడంతో పాటు, ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యసదుపాయం కల్పిస్తూ అదనంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారాను ఆదుకుంటోందన్నారు. ఇలా ప్రజలకు మేలు చేసే గొప్ప మనసున్న మన జగనన్న ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్రప్రజల అదృష్టమన్నారు.

ఆర్బీకేల్లో రైతులకు మెరుగైన సేవలు


రైతులతో మాట్లాడుతున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని మండల వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. రైతులతో ఏఓ డిల్లీప్రసాద్ మాట్లాడుతూ కియాస్క్ విధానం వల్ల అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు సకాలంలో అన్నిసేవలు గ్రామాల్లోనే అందడంతో రైతులు సంతోషం పడుతున్నారు. రైతుల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆర్బీకేల్లో కియాస్క్ యంత్రాల ద్వారా రైతులే స్వయంగా విత్తనాలు, ఎరువులు ఆర్డర్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మెషీన్ల ద్వారా వ్యవసాయ ఉత్పాదకాలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యంతో పాటు వాతావరణ సమాచారం, వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ధరలు తెలుసుకోవచ్చని తెలిపారు. పంట యాజమాన్య పద్ధతులపై ఆర్బీకేలో వీడియో రూపంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందువల్ల రైతులు ఆర్బీకేల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రబీ సీజన్‌లో ఈక్రాప్ నమోదైన పంట వివరాల లిస్టు ప్రదర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంగమాంబ జయంతి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి భక్తురాలు వెంగమాంబ తన సాహిత్యం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను విస్తరింపజేశారని పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు యువశ్రీ తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో గురువారం వెంగమాంబ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆచార్య యువశ్రీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ – జీవన గానం అనే అంశంపై ప్రసంగించారు. వెంగమాంబ రచనల్లో మహిళలకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. ప్రతి స్త్రీ వెంగమాంబ తత్వాన్ని అలవర్చుకుంటే సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సారకాయల కృష్ణారెడ్డి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ– దాన శాసనాలు అనే అంశంపై మాట్లాడారు. వెంగమాంబ 18 రచనలు చేయగా శ్రీ వేంకటాచల మహత్యం గ్రంథం చిరస్థాయిగా నిలచిపోయిందన్నారు. ఎస్వీ మ్యూజియం ఎస్‌డీవో కృష్ణారెడ్డి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ –సాహిత్యం –ప్రత్యేకత అనే అంశంపై ప్రసంగించారు. సాయంత్రం తిరుపతికి చెందిన శ్యాంకుమార్, తేజోవతి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.